- జగన్ ప్రభుత్వంలో అన్నీ రైతు వ్యతిరేక చర్యలే
- తంగెడంచ విత్తనోత్పత్తి క్షేత్రం పనులు ఆపేసిన ప్రభుత్వం
- టీడీపీ మీద వ్యతిరేకతే కారణం
- ముళ్ల చెట్లు పెరిగిన సీడ్ హబ్ ప్రాంతం
- నకిలీ విత్తనాలతో ఏటా దగా పడుతున్న రైతులు


ముళ్లకంపలు మొలిచిన మెగా సీడ్ ప్రాజెక్టు హబ్

సీడ్ హబ్‌కు సమాధి



కర్నూలు(అగ్రికల్చర్), మే 5:

కోతలరాయుడు జగన్ రైతు వెన్నంటే ఉంటామన్నారు. వారి ప్రయోజనాలను కాపాడేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. అవన్నీ ఒట్టి ప్రగల్బాలని తేలిపోయింది. వైసీపీ ప్రభుత్వం కొత్తగా ఏమీ చేయకపోగా గత టీడీపీ చేపట్టిన పథకాలను నేలపాలు చేసింది. రైతు వ్యతిరేకత, టీడీపీ వ్యతిరేకత మాత్రమే సీఎం జగన్ పాలనా విధానం. 2017లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో 673 ఎకరాల్లో మెగా సీడ్ హబ్ ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. వైసీపీ ప్రభుత్వం దానికి శాశ్వతంగా సమాధి కట్టేసింది. ఇప్పుడు అక్కడ ముళ్ల చెట్లు మొలిచాయి.




మెగా సీడ్ ప్రాజెక్టు పనులకు నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన రైతు ప్రయోజన పథకాలు వైసీపీ పాలనలో ధ్వంసమైపోయాయి. అవన్నీ అమలైతే టీడీపీకి ఎక్కడ పేరు వస్తుందో అని అక్కసులో సీఎం జగన్ ఈ దుర్మార్గానికి పాల్పడ్డాడని రైతులు విమర్శిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం రైతుల కోసం ఏమీ చేయకపోగా అనేక రకాలుగా నష్టం కలిగించే పనులు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం తంగెడంచ విత్తనోత్పత్తి క్షేత్రం. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సాంకేతిక సహాయ సహకారాలకు గుంటూరులోని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంతో, అమెరికాలోని ఐయోవా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా జైన్ కంపెనీకి మొదట్లో కొంత స్థలాన్ని నాణ్యమైన విత్తనోత్పత్తి కోసం కేటాయించారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నాటి వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్రంలో నాణ్యమైన విత్తనోత్పత్తిని చేపట్టిన విత్తన కంపెనీ ప్రతినిధులతో, వ్యవసాయ శాస్త్రవేత్తలతో, అధికారులతో కర్నూలు నగరంలోని స్టేట్ గెస్టుహౌస్‌లో సమావేశం నిర్వహించారు. వారి అందరి అభిప్రాయాలు తీసుకుని ప్రభుత్వానికి నివేదికను పంపేందుకు చర్యలు తీసుకున్నారు. ఇదంతా జరుగుతూ ఉండగానే 2019లో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో మెగా సీడ్ హబ్ ప్రాజెక్టు పనులకు నూకలు చెల్లిపోయాయి. ఇలా జిల్లాలో రైతులు ఎన్నో రకాలుగా తీవ్రంగా నష్టపోయారు.

రైతుల విత్తన కష్టాలు

ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు నాణ్యమైన విత్తనాలు దొరక్క పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారు. కొంత మంది వ్యాపారులు, దళారులు, అధికారుల అండదండలతో పెట్రేగిపోతూ రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దాదాపు దశాబ్దకాలంగా ఈ అక్రమాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన పంటలు పత్తి, మిరప, మొక్కజొన్న, వరి తదితర పైర్లకు సంబంధించిన వరి విత్తనాలను అందించడంలో వ్యవసాయ శాఖ చేతులెత్తేసే పరిస్థితిని తెచ్చింది. దీన్ని ఎలాగైనా అరికట్టాలని, నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయించి ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకే కాకుండా దేశమంతాటా సప్లయ్ చేయాలనే బృహత్తర లక్ష్యంతో 2017 జూన్ 21న తంగడంచ గ్రామం వ్యవసాయ క్షేత్రంలో చంద్రబాబు ఇక్కడ మెగా సీడ్ హబ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ 1623 ఎకరాల సారవంతమైన భూములు ఉన్నాయి. రూ.675 కోట్లు కేటాయించారు. ఈ సీడ్ హబ్‌కు 673 ఎకరాలు కేటాయించారు. రూ.170 కోట్లతో ఈ మెగా సీడ్ ప్రాజెక్టు హబ్ అమలులో భాగంగా విస్తారమైన రోడ్లు, నాణ్యత కలిగిన విత్తనాల ఉత్పత్తి కోసం అవసరమైన నీటిని కేసీ కెనాల్ నుంచి విడుదల చేయించుకునేందుకు కాలువలు, ఇతరత్రా పనులు చురుగ్గా సాగాయి.

నిధులు మట్టిపాలు

గత టీడీపీ ప్రభుత్వం మెగా సీడ్ ప్రాజెక్టు అమలు కోసం రూ.675 కోట్లు కేటాయించింది. ఇందులో మౌలిక వసతుల కోసం రూ.170 కోట్లు. ముందుగా రూ.6 కోట్లతో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ విధానం వల్ల ఈ నిధులన్నీ నిరుపయోగమయ్యాయి.



నకిలీ విత్తనాలతో రైతులు ఏటా నష్టపోతున్నారు

రైతులు లాభపడాలంటే.. ముందుగా వారికి నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందించాలి. దీని కోసమే నాటి టీడీపీ హయాంలో తంగడంచ వ్యవసాయ క్షేత్రంలో మెగా సీడ్ హబ్ ప్రాజెక్టు మొదలు పెట్టింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇటువంటి బృహత్తర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలి. కానీ సీఎంగా జగన్ సీడ్ హబ్‌ను ఆపేశారు. దీంతో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతున్నారు.

\- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

వైసీపీ అధికారంలోకి వచ్చాక నూకలు చెల్లు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టగానే మెగా సీడ్ హబ్‌కు నూకలు చెల్లిపోయాయి. బంగారం పండించే నేల, అనుకూల వాతావరణం, సీడ్ హబ్‌గా చేస్తే దేశమంతటికీ విత్తన కొరత తీర్చే ఈ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. పరిశోధనలతో కళకళలాడాల్సిన ఈ ప్రాంతం వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అని ప్రస్తుతం ముళ్లకంపలకు నిలయంగా మారింది. సీడ్ హబ్‌లో భాగంగా అంతర్జాతీయంగా పేరుగాంచిన జైన్ ఇరిగేషన్, గజరాత్ అంబూజా ఎక్స్‌పోర్టు వంటి సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో కృషి జరిగింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక జైన్ ఇరిగేషన్ అధికారులు పనులు మానేశారు. గుజరాత్‌లోని అంబూజా ఎక్స్‌పోర్టు సంస్థ కనిపించడం లేదు. ఇక్కడ నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేస్తే దేశవ్యాప్తంగా రైతులకు మేలు జరుగుతుందని, స్థానికంగా ఉపాది అవకాశాలు పెరుగుతాయని రైతు సంఘాల నేతలు ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వానికి విన్నవించుకుంటునే ఉన్నారు. కానీ సీఎం జగన్ పట్టించుకోలేదు.



అన్నదాతలపై ఇంత కక్ష తగదు

గత రెండు సంవత్సరాలుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి, మిరప, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేసే రైతులు నాసిరకం విత్తనాల వల్ల పూర్తిగా నష్టపోయారు. నష్టపోయిన పత్తి రైతులకు పరిహారాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ ఇవ్వలేదు. పైగా గత సీఎం చంద్రబాబు నాణ్యమైన విత్తనాల కోసం ఆరంభించిన మెగాసీడ్ ప్రాజెక్టు పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఆపేసింది. రైతుల మీద ఇంత కక్ష మంచిది కాదు.

\- శంకర్ నాయుడు, రైతు

నేడు కర్నూలుకు చంద్రబాబు రాక

చెన్నమ్మ సర్కిల్లో ఉదయం 11 గంటలకు బహిరంగ సభ



కల్లూరు, మే 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కర్నూలుకు (పాణ్యంనియోజకవర్గం) రానున్నారు. అనంతపురం జిల్లా పర్యటన ముగించుకుని సోమవారం ఉదయం 10:45 గంటలకు బళ్ళారి చౌరస్తా పీపీఎస్‌పీ బెటాలియన్-2 చేరుకుంటారు. అక్కడి నుండి 10:50కి రోడ్డు మార్గం గుండా నగరంలోని చెన్నసర్కిల్‌కు 10:55 గంటలకు చేరుకుంటారు. 11 నుంచి 12:30 వరకు చెన్నమ్మసర్కిల్లో జరిగే ప్రజాగళం సభలో మాట్లాడతారు. మధ్యాహ్నం 12:40 గంటలకు సభ ముగించుకుని 1:10కు ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ప్రత్యేక విమానంలో విశాఖపట్టణం చేరుకుంటారు.

'బహిరంగసభను విజయవంతం చేయండి'

టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు చెన్నమ్మసర్కిల్లో చేపట్టనున్న ప్రజాగళం బహిరంగసభను విజయవంతం చేయాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల, ఓర్వకల్లు, పాణ్యం, కల్లూరు మండలాల ప్రజలు సభకు రావాలని అన్నారు.

ప్రశాంతంగా 'నీట్'



ఎ.క్యాంపు మైఫర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద గుమికూడిన విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 5: దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాల లోని ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కోసం నిర్వహించే నీట్ పరీక్ష ఆదివా రం ప్రశాంతంగా ముగిసింది. మండే ఎండవేడిమికి తోడు పరీక్ష టెన్షన్ తో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. కర్నూలు జిల్లాలో నీట్ యుజీ పరీక్షకు 4,944 మంది నమోదు చేసుకోగా.. 4838 మంది హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు. కర్నూలులో 98 శాతం హాజరు నమోదైంది. గామీణ ప్రాంతాల నుంచి కర్నూలు నీట్ పరీక్ష కేంద్రానికి హాజరయ్యే విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు ప్రైవేటు వాహనాలు అద్దెకు తీసుకుని కర్నూలు చేరుకున్నారు. ఉదయం 11 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో ఆయా ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. ఉదయం 11:30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల మెయిన్ గేటు వద్ద చెక్ చేసి లోపలికి అనుమతించారు. చేతి గడియారాలు, బంగారు నగలు సెక్యూరిటీ సిబ్బంది గేటు బయటనే తొలగించి కేంద్రంలోనికి అనుమతించారు. కర్నూలు నగరంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నీట్ యూజీ పరీక్షను సిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

కర్నూలు(కలెక్టరేట్), మే 5: పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఉంటుందని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహణ, హోం ఓటింగ్ అంశాలపై రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ షెడ్యూల్, వెన్యూ వివరాలను పొలిటికల్ పార్టీలకు, అభ్యర్థులకు ముందుగానే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఫెసిలిటేషన్ సెంటరులో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఓటర్లకు దిశా నిర్దేశం చేసేందుకు వీలుగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించే ముందు ట్రంక్ బాక్స్ ఖాళీగా ఉందనే విషయాన్ని వీడియోలో రికార్డు చేయించడంతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లకు చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత వారి ముందే ట్రంక్ బాక్స్‌ను లాక్ వేసి సీల్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అభ్యర్థుల సమక్షంలో లోకల్ ట్రెజరీలో డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్లలో విదులు నిర్వహించే సిబ్బంది ఉదయం 7 గంటలకు విధులలో ఉండాలన్నారు.

ఏపీని పేద రాష్ట్రంగా మార్చిన జగన్

- రాజ్యమేలుతున్న మద్యం, ఇసుక, భూ మాఫియా
- ఎన్డీయేతోనే ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వం
- సాగు, తాగునీటితో సస్యశ్యామలం చేస్తాం
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్


భారీగా తరలి వచ్చిన కూటమి నాయకులు, అభిమానులు

ఆదోని, మే 5: దక్షిణ భారతదేశంలో సంపన్న వంతమైన ఆంధ్రప్రదేశ్‌ను వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద రాష్ట్రంగా మార్చేశారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదోనిలో పర్యటించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి వైఎమ్‌జీ సర్కిల్ వరకు వచ్చి, అక్కడ నుంచి రోడ్‌షో ద్వారా భీమాస్ సర్కిల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తరాదితో పోల్చితే ఎంతో గొప్పగా ఉన్న ఏపీ నేడు అప్పుల్లో కూరుకుపోయి పేద రాష్ట్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో జగన్ ప్రభుత్వం మద్యం, ఇసుక, భూ మాఫియాలో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రజలకు మేలు చేసే ఎన్డీఏ కూటమికి పట్టం కట్టాలని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత మేమే తీసుకుంటామని అన్నారు. ఐదేళ్ల మోదీ పాలనలో రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయలేదని, కేంద్రం రూ.వేల కోట్ల నిధులు విడుదల చేసి, ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న పేద ప్రజలకు ఉచితంగా గృహాలు అందించాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఏపీలో 21 లక్షల ఇళ్లను పేదవారికి నిర్మించి ఇవ్వాలని నిధులు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం రెండు లక్షల ఇళ్లను నిర్మించి ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇంటింటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని రూ.14,500 కోట్లు అమృత్ మిషన్ కింద ఏపీకి మంజూరు చేస్తే కేవలం రూ.1,400 కోట్లు మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఆదోనిలో ఉన్న పేద ప్రజలకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో రూ.400 కోట్లు నిధులు మంజూరు చేస్తే, ఆ నిధులను స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఖర్చు చేయలేక నిధులను వెనక్కి పంపించారని అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజును గెలిపించి పార్లమెంటుకు పంపాలని కోరారు. ఇద్దరిని గెలిపిస్తే ఆదోనిని అభివృద్ధి చేసే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని, అప్పుడే అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, బీజేపీ నాయకుడు విట్టా రమేష్, సావిత్రి, చంద్రమౌళి పాల్గొన్నారు.


ప్రచార రథంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆదోని అసెంబ్లీ కూటమి అభ్యర్థి డా. పార్థసారథి, కర్నూలు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పంచలింగాల నాగరాజు

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా
- కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


ఎరుకలచెరువు గ్రామంలో మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

క్రిష్ణగిరి, మే 5: ఎన్నికల తరువాత తాను పారిపోయే వ్యక్తిని కాదని, ప్రజల మధ్యనే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కర్నూలు పార్లమెంట్ కూటమి అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం కోయిలకొండ, ఎరుకలచెరువు, అమకతాడు, మాదాపురం, కర్లకుంట, పుట్లూరు గ్రామాలలో పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో 15 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. జగన్‌ను ఇంటికి పంపే సమయం ఆసన్నమైందన్నారు. సొంత చెల్లెలే తన అన్నకు ఓటేయవద్దని ప్రచారం చేయడం జగన్ సైకో పాలనకు నిదర్శనం అన్నారు. కేఈ వేణు బాబు, కేఈ నందీష్, నబీ సాహెబ్, సర్పంచ్ ప్రవీణ్, మాజీ ఎమ్పీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మిగనూరులో కురుబల ఆత్మీయ సదస్సులో టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా కురుబలు హాజరయ్యారు. కురుబలు ఐకమత్యంగా ఉండాలన్నారు. మొదటిసారి కురుబలకు ఎంపీగా అవకాశం వచ్చిందని తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఎమ్మిగనూరులో జరిగిన కురుబల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

ఎన్నికల చిత్రాలు

శంఖం పూరించిన రాజన్న



శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ఎన్నికల శంఖం పూరించారు. ప్రచారంలో భాగంగా ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని గాంధీ పార్కు వద్ద అభిమానులు అందించిన శంఖం ఊది జనాలను ఆకట్టుకున్నారు. అదేవిధంగా వాహనంపైన ఉన్న ఆయన ఓ చిన్నారిని ఎత్తుకొని ఓటర్లను ఆకర్షించారు.

- ఆత్మకూరు



అమ్మలాంటి.. బంగారమ్మ



ఎన్నికల వేళ చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు, వారి తరపు బంధువులు వినూత్నంగా ప్రచారం సాగిస్తూ ముందుకు సాగుతున్నారు.ఇందులోభాగంగానే మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి మరదలు బంగారమ్మ కోసిగిలో బాలుడికి స్నానం చేయిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.

- కోసిగి

కొడితే కొట్టాలి.. గెలుపు పట్టాలి





కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ రోజుకో వినూత్న రీతిలో ప్రచారం సాగిస్తున్నారు. ఆదివారం బీ క్యాంపులోని క్రీడా మైదానంలో కలియదిరిగారు. అక్కడ ఉన్న క్రీడాకారులను పలకరించి టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం క్రికెట్, వాలీబాల్ ఆడి అక్కడ ఉన్న యువకులను ఆకట్టుకున్నారు.

- కర్నూలు అర్బన్



పెత్తనమంతా రెడ్లదే

● ఎక్కువ సార్లు గెలిచింది కాంగ్రెస్ అభ్యర్థులే ● మూడు సార్లు జెండా ఎగరేసిన టీడీపీ

నంద్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు: జిల్లాలోని ఏకైక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నందికొట్కూరు. ఇక్కడ ఎస్సీ సామాజిక వర్గీయులు ఎక్కువ. అయితే పెత్తనం మాత్రం రెడ్లదే! రిజర్వుడు నియోజకవర్గంగా మారే వరకు నందికొట్కూరులో రెడ్లే ఎక్కువ సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇక ఎస్సీ నియోజకవర్గంగా మారిన తర్వాత కూడా ఇక్కడ రాజకీయాలను రెడ్లే శాసిస్తున్నారు.



● నందికొట్కూరు ఎన్నికల చరిత్ర..

స్వాతంత్ర్యం అనంతరం 1952లో నందికొట్కూరు నియోజకవర్గంగా ఏర్పడింది. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గానికి 16 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారే వరకు జరిగిన ఎన్నికల్లో ఎస్.కె.లింగం మినహా, దాదాపు 12 సార్లు ఎన్నికైన ఎమ్మెల్యేలంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం! 1952లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కమ్యూనిస్టు యోధుడు చంద్ర పుల్లారెడ్డి సీపీఐ నుంచి గెలుపొందారు. ఇందులో అత్యధికంగా కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ)తో కలిపి ఎనిమిది సార్లు, టీడీపీ మూడు సార్లు, సీపీఐ ఒకసారి, వైసీపీ అభ్యర్థులు రెండు సార్లు గెలుపొందారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. 1972లో మద్దూరు సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా గెలుపొందడం విశేషం. అత్యధికంగా బైరెడ్డి శేషశయనా రెడ్డి మూడు సార్లు గెలుపొంది కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర మంత్రిగా కూడా పని చేశారు. ఆయన కుమారుడు 1994, 1999లో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రెండు సార్లు గెలిచారు. నందికొట్కూరు ఎస్సీ నియోజకవర్గంగా మారే చివరి ఎన్నికలు 2004లో గౌరు చరిత నందికొట్కూరు నుంచి మొదటి మహిళా ఎమ్మెల్యేగా గెలుపొందారు.

నందికొట్కూరు (ఎస్సీ) నియోజకవర్గంలోని కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు పగిడ్యాల మిడ్తూరు ఆరు మండలాల్లో 63,966 ఇళ్లు ఉండగా అందులో 2,69,053 జనాభా ఉంది. ఇందులో పురుషులు 1,35,192,

● నియోజకవర్గం ఓటర్లు 216559..

స్త్రీలు 1,25,766 మంది ఉన్నారు. ఎస్సీ జనాభా 67,054 కాగా ఎస్టీలు 3476 మంది ఉన్నారు. నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 216559 ఉండగా, పురుషులు 106215 మంది, మహిళలు 110417 మంది, థర్డ్ జండర్లు 17 మంది ఉన్నారు.

● నియోజకవర్గ భౌగోళిక సరిహద్దు..

నందికొట్కూరు నియోజకవర్గానికి మూడు నియోజకవర్గాలు, తెలంగాణ రాష్ట్రం సరిహద్దులుగా ఉన్నాయి. నియోజకవర్గానికి తూర్పు శ్రీశైలం నియోజకవర్గం, పడమర కోడుమూరు, దక్షిణాన పాణ్యం, ఉత్తరాణ కృష్ణానది, తెలంగాణ రాష్త్రం సరిహద్దులుగా ఉన్నాయి. శ్రీశైలం జలాశయం వల్ల ముంపునకు గురైన గ్రామాలు ఎక్కువగా నందికొట్కూరు నియోజకవర్గంలోనే ఉండటం గమనార్హం. ఇక ప్రముఖ క్షేత్రం సంగమేశ్వరం, రాష్ట్రంలోని ఏకైక సరస్వతి దేవీ (కొలనుభారతి) పుణ్యక్షేత్రం నందికొట్కూరులోనే ఉండటం విశేషం.

వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం

నందికొట్కూరు నియోజకవర్గం వ్యవసాయమే ఆధారంగా ఉంది. కృష్ణా నది నియోజవర్గ సరిహద్దులో ప్రవహిస్తోంది. సుంకేసుల నుంచి కర్నూలు టు కడప కాలువ ద్వారా నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాలకు సాగు నీరు అందుతోంది. కొత్తపల్లి, నందికొట్కూరు, పాములపాడు మండలాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందుతోంది. కేవలం ఒక్క మిడ్తూరు మండలానికి మాత్రమే ఎలాంటి సాగునీటి పథకాలు లేవు.

● ఎమ్మెల్యేల పేర్లతో కాలనీలు:

నందికొట్కూరు పట్టణంలో ఎమ్మెల్యేల పేర్లతో పలు కాలనీలు ఏర్పడ్డాయి. ఎన్.కె. లింగం నుంచి కాలనీలకు పేర్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే లింగం కాలనీ, బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్ ఇలా పలు కాలనీలు ఎమ్మెల్యేలు చేసిన కృషికి గుర్తుగా వారి పేర్లతో ఏర్పడ్డాయి.

● పునర్విభజన:

2009లో పునర్విభజనలో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గాన్ని ఎస్సీ రిజర్వుడుగా మార్చారు. అంతకు ముందు ఐదు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గం ఆరుకు పెరిగింది. ఓర్వకల్లు మండలం పాణ్యం నియోజకవర్గంలో కలవగా, నందికొట్కూరులో పాములపాడు, కొత్తపల్లి మండలాలు కొత్తగా కలిశాయి. ప్రస్తుతం నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాలు నియోజకవర్గంలో భాగంగా ఉన్నాయి. రిజర్వుడుగా మారిన తర్వాత నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఒకసారి గెలవగా, వైసీపీ అభ్యర్థులు రెండు సార్లు గెలిచారు. అయితే వీరంతా స్థానిక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారి అండదండలతోనే ఎమ్మెల్యేలుగా గెలవటం గమనార్హం.

1952-2019 వరకు నందికొట్కూరు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, విజేతల వివరాలు ఇవీ...

	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మొత్తం ఓట్లు	ఆధిక్యం
1952	సి.పుల్లారెడ్డి	సీపీఐ	సుబ్బారెడ్డి	కాంగ్రెస్	70,983	11,907
1955	ఎన్.కె.లింగం	కాంగ్రెస్	పుల్లారెడ్డి	సీపీఐ	2,17,030	7,563
	అయ్యపురెడ్డి	కాంగ్రెస్	పుల్లారెడ్డి	సీపీఐ	---	11306
1962	పుల్యాలవెంకటకృష్ణారెడ్డి	స్వతంత్ర	సీ.ఆర్.రెడ్డి	కాంగ్రెస్	65,525	3,857
1967	చల్లా రాంభూపాల్‌రెడ్డి	కాంగ్రెస్	వెంగళరెడ్డి	స్వతంత్ర	84,387	2,927
1972	మద్దూరు సుబ్బారెడ్డి	కాంగ్రెస్	ఏకగ్రీవం	----	1,08,866	-----
1978	బైరెడ్డి శేషశయనారెడ్డి	కాంగ్రెస్(ఐ)	ఎం.సుబ్బారెడ్డి	స్వతంత్ర	99,386	10,772
1983	బైరెడ్డి శేషశయనారెడ్డి	స్వతంత్ర	ఐ.తిమ్మారెడ్డి	టీడీపీ	1,11,437	4,484
1985	ఐ.తిమ్మారెడ్డి	టీడీపీ	బి.శేషశయనారెడ్డి	కాంగ్రెస్	1,23,771	2,072
1989	బైరెడ్డి శేషశయనారెడ్డి	కాంగ్రెస్	తిమ్మారెడ్డి	టీడీపీ	1,42,463	4,128
1994	బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి	టీడీపీ	గిడ్డారెడ్డి	కాంగ్రెస్	1,40,070	28,120
1999	బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి	టీడీపీ	జి.వెంకటరెడ్డి	కాంగ్రెస్	1,51,675	14,283
2004	గౌరు చరితారెడ్డి	కాంగ్రెస్	బి.రాజశేఖర్‌రెడ్డి	టీడీపీ	1,72,052	13,488
2009	లబ్బివెంకటస్వామి	కాంగ్రెస్	సి.బిచ్చన్న	టీడీపీ	1,83,609	5,773
2014	యక్కలదేవి ఐజయ్య	వైసీపీ	లబ్బివెంకటస్వామి	టీడీపీ	1,60,024	21,862
2019	తొగూరు ఆర్థర్	వైసీపీ	బండి జయరాజ్	టీడీపీ	1,71,721	40,259

విద్యావంతుడి మాట

ఐటీ ప్రదాత చంద్రబాబే



హైదరాబాదులో ఐటీ రంగం ఇంత పెరిగిందంటే ఐటీ ప్రదాత టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడేనని ఐటీ ఉద్యోగి, టీడీపీ నాయకుడు హుసేన్‌బాషా అన్నారు. ఆదివారం రుద్రవరంలో మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి ఐటీ ఉద్యోగి స్వచ్ఛందంగా పాల్గొని టీడీపీని గెలిపించాలని కోరారు. అన్నివిధాలా ఏపీలో అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు.

- రుద్రవరం

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి: కలెక్టర్



ఫెసిలిటేషన్ సెంటర్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 5: నేటి నుంచి మే 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అన్నారు. ఆదివారం 138-పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి నగరంలోని బీ క్యాంపులో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎ.క్యాంప్ లోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, 143-కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పాత కంట్రోల్ రూమ్ దగ్గర ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటర్ల జాబితాలో పేరు ఉండి, అనివార్య కారణాల వల్ల పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోతే, ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే.. ఆ నియోజకవర్గం ఆర్వోకు 6, 7, 8 తేదీల్లో ఫామ్-12 దరఖాస్తు, ఎన్నికల డ్యూటీ ఆర్డర్‌లను సమర్పించి అక్కడే ఉన్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క ఓటరుకు వారి నియోజకవర్గం ఫెసిలిటేషన్ సెంటర్ వివరాలు తెలుపుతూ ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా వారి మొబైల్ ఫోన్‌లకు సందేశం (ఎస్ఎంఎస్) పంపించామని కలెక్టర్ తెలిపారు. ఫెసిలిటేషన్ కేంద్రాలు 6, 7, 8 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతాయని తెలిపారు. కాగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12లో 15,827 మంది దరఖాస్తు చేసుకోగా ఫారం-12-డి(హోం ఓటింగ్)కు 997, ఫారం-12-డి(అత్యవసర సేవలు)కు 1,257 వచ్చాయి. మొత్తంమీద 18,081 మొత్తం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

నలిగిపోతున్న నాలుగో సింహం

● పోలీసుల టీఏ, డీఏలకు మంగళం
● సరెండర్ లీవ్‌లకూసంకెళ్లు
● సమస్యలపై నోరెత్తలేని దయనీయం
● వైసీపీ పాలనలో పోలీసుల దుస్థితి ఇది

నంద్యాల (నూనెపల్లె), మే 5: దొంగలు పడితే మేము పట్టుకోవాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చక్కదిద్దాలి. ప్రముఖులు పర్యటనకు వస్తే చెమటలు కక్కేలా బందోబస్తు చేయాలి. అధికారుల ఆదేశాలు పాటించే క్రమంలో వారి తిట్లు తినాలి. ఎండైనా.. వానైనా.. చలి అయినా విధులు నిర్వర్తించాల్సిందే. పైకి కనిపించే గాంభీర్యం తమ జీవితాల్లో లేదని లేదని పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విధుల్లో, వ్యక్తిగతంగా కష్టాల పాలు అయ్యామని వాపోతున్నారు. డిమాండ్ల సాధనకు, సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు పోరాడినట్టు తాము పోరాడలేమని క్రమశిక్షణ పేరుతో చేతులు కట్టేస్తున్నారని చెబుతున్నారు. సమాజం కోసం పని చేసే పోలీసులు వారి సమస్యల పరిష్కారానికి నోరెత్తని స్థితి ఏర్పండింది. 20 ఏళ్ల సర్వీసులో ఏనాడు ఎరగని అరాచకం చూశామని, వైసీపీ ప్రభుత్వ పాలనలో తిట్లు, శాపనార్థాలే ఎదురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

వీక్లీ ఆఫ్ ఏదీ..?

సింగా గద్దె ఎక్కిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులపై అమితమైన ప్రేమను ఒలకబోశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వీక్లీ ఆఫ్‌లు ఇస్తామంటూ హామీలు గుప్పించింది. అధికారం చేపట్టిన ఆరు నెలల తర్వాత వీక్లీ ఆఫ్‌లు అమలు చేశారు. ఆరు నెలలు గడిచాయో లేదో వీక్లీ ఆఫ్‌లకు మంగళం పాడేశారు. అదేమని అడిగితే సరిపడా సిబ్బంది లేరంటూ వంక పెట్టారు. జాబ్ క్యాలెండర్ అంటూ యువతను నట్టేట ముంచారు. పోలీసు రిక్రూట్‌మెంట్ చేయకుండా వదిలివేశారు. ఒక పక్క వందల సంఖ్యలో సిబ్బంది ఉద్యోగ విరమణ చేస్తుంటే దానికి తగ్గట్టుడా కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా మీనమేషాలు లెక్కించారు. ఉన్న అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

సరెండర్ లీవులకు సంకెళ్లు....

పోలీలసు సిబ్బంది అంటే 24 గంటలు డ్యూటీ చేయాల్సిందే. ఏడాది పొడవునా విధులు నిర్వహించాలి. నిరంతరం విధుల్లో ఉండటంతో వీరి కోసం ఏడాదికి ఒక నెల జీతం అదనంగా చెల్లించేవారు. దీనిని విడతల వారీగా చెల్లించేవారు. ఏడాదిలో జనవరి, జూలై, నవంబరు నెలల్లో చెల్లించేవారు. మూడు టర్మ్‌ల సరెండర్ లీవులు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు అది సాధ్యం కాలేదు. ఒక్కొక్కరికి వారి క్యాడర్‌ను బట్టి అంటే కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారి వరకు ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి, రూ.4.5 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. దీనిపై యూనియన్ నాయకులు అడుగుతున్నా ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోందని పోలీసు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీఏ డీఏలకు మంగళం....

పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ గస్తీ తిరగాల్సిందే. వివిధ ప్రాంతాలకు వెళ్లాలి. ఇందుకు సిబ్బంది అందరికీ టీఏ ఇచ్చేవారు. ప్రతి నెలా రూ.1400-చెల్లించేవారు. బందోబస్తుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళితే రోజుకు టీఏగా రూ.500 నుంచి 600 వరకు ఇచ్చేవారు. గత ప్రభుత్వం హయాంలో ఆలస్యంగా ఇచ్చినా కనీసం మూడు నాలుగు నెలలకోసారి అయినా సొమ్ము మొత్తం చెల్లించేవారు. ఇలా ఒకేసారి పెద్ద మొత్తంలో నగదు వస్తుండంతో సంతోషించేవారు. వైసీపీ పాలనలో టీఏ, డీఏలు మానేశారు. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. కానీ గట్టిగా అడగలేని పరిస్థితి.



బీమా ఏదీ....?

ప్రభుత్వ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ ఉంటుంది. ఒక్కో ఉద్యోగి వారి స్తోమతను బట్టి రూ.650 చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం జీతంలో నుంచి కట్ చేస్తుంది. ఇలా కట్ చేసిన సొమ్ము ఉద్యోగుల ఖాతాలో కనిపించాలి. కానీ జీరో చూపిస్తోంది. పైగా కట్ చేసిన సొమ్మును బీమా కంపెనీకీ కట్టడం లేదని, ప్రభుత్వమే వాడేసుకుంటుందని పోలీసు సిబ్బంది ఆరోపిస్తున్నారు. బీమా కంపెనీకీ డబ్బులు కట్టని పరిస్థితిలో ఒకవేళ ఉద్యోగికి ఏదేని అనుకోని ఘటన జరిగితే సదరు కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తనకు రూ.1.5 లక్షల సరెండర్ లీవులు చెల్లించాలని ఓ హెడ్ కానిస్టేబుల్ ఆవేదన చెందుతున్నారు. అలాగే ఉద్యోగ విరమణ ప్రయోజనం అందలేదని మరో విశ్రాంత పోలీసు ఉద్యోగి తెలిపారు.

నచ్చితే మళ్లీ.. మళ్లీ!

● వరుస ఎన్నికల్లో ఒకే వ్యక్తికి పట్టం కట్టబెట్టిన ఓటర్లు
● బీవీ సుబ్బారెడ్డి నాలుగు సార్లు, కే సుబ్బారెడ్డి మూడు సార్లు ఎన్నిక
● ఆ తర్వాత ఫ్యాక్షన్ నాయకులదే హవా





నంద్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి)/బనగానపల్లె: బనగానపల్లె మొదట్లో కోయిలకుంట్ల నియోజకవర్గంలో భాగంగా ఉండేది. పునర్విభజనలో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు సాధారణ ఎన్నికలు, ఒకసారి ఉప ఎన్నిక (1975లో) జరిగాయి. ఇక్కడ మొదటి రెండు పర్యాయాలు సోషలిస్టు, స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం వరకు కాంగ్రెస్ ఎక్కువ సార్లు గెలుపొందింది. ఆ తర్వాత టీడీపీ వరుసగా విజయాలు సాధించింది.

గెలుపు ఓటములను తేల్చేది వీరే..

బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం 241179 ఓట్లు ఉండగా బనగానపల్లె మండలం దాదాపు 82,323 ఓట్లు, అవుకు మండలంలో 42908 ఓట్లు, కొలిమిగుండ్ల మండలంలో 42395 ఓట్లు, కోవెలకుంట్ల మండలంలో 38,366 ఓట్లు, సంజామల మండలంలో 31811 ఓట్లు ఉన్నారు. దాదాపు 30 శాతానికి పైగా ఓటర్లతో బనగానపల్లె మండలం ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తోంది. ఇక ఆ తర్వాత అవుకు మండల ఓటర్లు అభ్యర్థుల గెలుపును ప్రభావితం చేస్తోంది.

● హాట్రిక్ వీరులు..

బనగానపల్లె నియోజకవర్గంగా ఏర్పడక ముందు కోయిలకుంట్ల నియోజకవర్గంగా ఉండేది. 2009 వరకు 13 సార్లు కోయిలకుంట్ల నియోజకవర్గ పరిధిలోనే ఎన్నికలు జరిగాయి. 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో ఎన్‌వీ రెడ్డి సోషలిస్టు పార్టీ తరఫున గెలుపొందారు. 1955 రెండో ఎన్నికల్లో బీవీ సుబ్బారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. ఇక ఆ తర్వాత బీవీ సుబ్బారెడ్డి 1962 నుంచి 1972 వరక మూడు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది నాలుగు సార్లు వరుసగా విజయం సాధించిన నేతగా నిలిచారు. ఆ తర్వాత దశాబ్దం పాటు ఆయా నేతలు గెలుస్తూ వచ్చారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1985 నుంచి 1994 వరకు కే సుబ్బారెడ్డి మూడు సార్లు వరుసగా విజయం సాధించి హాట్రిక్ కొట్టారు. అప్పటి వరకు మంచితనం ఉన్న నాయకులను ఎన్నుకుంటూ వచ్చిన కోయిలకుంట్ల ఓటర్లు ఆ తర్వాత ఫ్యాక్షన్ నాయకులకు పట్టం కడుతూ వచ్చారు. 1999 నుంచి కిందటి ఎన్నికల వరకు మధ్యలో 2014లో ఒకసారి బీసీ జనార్దన్‌రెడ్డి మినహా ఫ్యాక్షన్ నేతలుగా ముద్రపడ్డ చల్లా రామకృష్ణారెడ్డి, కాటసాని రామిరెడ్డికే ప్రజలు ఓట్లు వేస్తూ గెలిపిస్తూ వస్తున్నారు.

కురువల వస్త్రధారణలో...



టీడీపీ తరపున కర్నూలు ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న బస్తిపాటి నాగరాజు ఎమ్మిగనూరులో జరిగిన కురువల ఆత్మీయ సమ్మేళనంలో ఇలా కురువ సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు.
- ఎమ్మిగనూరు







హోరాహోరీ పోరు.. గెలిచేదెవరు..?

బిగ్ ఫైట్

కర్నూలు బరిలో టీజీ భరత్, ఇంతియాజ్

కీలకం

● ఓటర్ల వివరాలు:

● నియోజకవర్గం	: కర్నూలు
● పోలింగ్ కేంద్రాలు	: 258
● మొత్తం ఓటర్లు	: 2,74,465
● పురుషులు	: 1,32,769
● మహిళా ఓటర్లు	: 1,41,665
● థర్డ్ జండర్ ఓటర్లు	: 31

● సామాజిక వర్గాల వారిగా (సుమారుగా)..:

ముస్లిం మైనార్టీలు	: 70 వేలు
ఎస్సీలు	: 55 వేలు
ఆర్యవైశ్యులు	: 20 వేలు
వాల్మీకులు	: 25 వేలు
బలిజలు	: 15 వేలు
నాయి బ్రహ్మణులు	: 9 వేలు
బేస్త	: 8 వేలు
చేనేతలు	: 8 వేలు
రెడ్లు	: 10 వేలు
కమ్మ	: 6 వేలు
ఇతరులు	: 48,465

కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): కందెనవోలు కోట ఈసారి ఎవరిదో అన్న చర్చ సాగుతోంది. ప్రధానంగా టీడీపీ, వైసీపీల మధ్య పోటీ నడుస్తోంది. ఈ హోరాహోరీ పోరులో టీజీ భరత్, ఇంతియాజ్ సై అంటున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా ఐదేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్యలోనే ఉంటున్నారు. వైసీపీ అభ్యర్థి ఏఎం ఇంతియాజ్ ఎన్నికల ముందు ఉద్యోగానికి రాజీనామా చేసి బరిలో దిగారు. ప్రజలకు కొత్త వ్యక్తి.. నాన్ లోకల్ అనే ముద్ర ఉంది. ఆయన సామాజికవర్గానికే చెందిన జిలానీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. కర్నూలు అర్బన్ సహా రూరల్ మండలం, కల్లూరు మండలాలు ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉండేవి. 2009 నియోజకవర్గల పునర్విభజన తరువాత కార్పొరేషన్ పరిధిలోని 32 వార్డులతో కర్నూలు నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి 2019 వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగితే.. 9 సార్లు కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, వైసీపీ రెండు పర్యాయాలు చొప్పున విజయం సాధించాయి. టీడీపీ ఆవిర్భావం తరువాత 1983లో జరిగిని ఎన్నికల్లో ఓటర్లు టీడీపీకే పట్టం కట్టారు. ఆ పార్టీ అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి విజయం సాధించి.. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. 1999లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీజీ వెంకటేశ్ విజయం సాధించారు. పొత్తులో భాగంగా ఓసారి టీడీపీతో.. మరోసారి కాంగ్రెస్‌తో జతకట్టిన సీపీఎం రెండుసార్లు గెలిచింది. 2009 ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన టీజీ వెంకటేశ్ ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రులు కె. రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. 1952లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన దామోదరం సంజీవయ్య మద్రాస్ రాష్ట్రంలోనూ, ఆంధ్ర రాష్ట్రంలోనూ మంత్రిగా పని చేశారు. ఉమ్మడి ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్రలోకి ఎక్కారు.

● **అందరి చూపు కర్నూలు వైపే..!:** కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పోయిన ఎన్నికల్లో టీజీ భరత్ గెలుపు అంచుల దాకా వెళ్లి చివరలో రెండు రౌండ్లలో వెనుకబడి అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన హఫీజ్‌ఖాన్‌కు మళ్లీ టికెట్ ఇవ్వకుండా ఐఏఎస్ అధికారి ఇంతియాజ్‌ను ఉద్యోగానికి రాజీనామా చేయించి కర్నూలు నుంచి పోటీ చేయించింది. కూటమి పార్టీలు జనసేన, బీజేపీ శ్రేణులు కూడా టీడీపీ గెలుపు కోసం విశేష కృషి చేస్తున్నాయి. అదే క్రమంలో వైసీపీ అభ్యర్థి ఏఎం ఇంతియాజ్ కూడా ప్రచారం జోరు పెంచారు. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గాయత్రి హాస్పిటల్స్ అధినేత జిలానీ పోటీలో ఉన్నారు.

టీజీ భరత్ బలాలు..

- 2019 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందాడనే సానుభూతి. ఐదేళ్లుగా నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే కాకపోయినా ప్రజలకు నేనున్నారనే భరోసా ఇవ్వడం. వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు ద్వారా ప్రజల మధ్యనే ఉండడం.

● బలహీనతలు..!:

- ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉండటం
- బీజేపీ, టీడీపీ కూటమిపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం

ఇంతియాజ్ బలాలు..

- దివంగత డాక్టర్ ఇస్మాయిల్ స్వయాన అల్లుడు కావడం. మెజార్టీ ఓటర్లు ఉన్న ముస్లిం మైనార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం.. ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌పై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేక ప్రభావం ఈయనపై చూపకపోవడం.

● బలహీనతలు..!:

- రాజకీయాలకు పూర్తిగా కొత్త కావడం. వైసీపీ ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గాలను సమన్వయం చేసుకోవడంలో విఫలం కావడం. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గాలు సహకరించకపోవడం

చేనేత నాయకుడికి అవమానం

పెద్దాయన వద్ద బోరున విలపించిన పరిస్థితి నాకే దిక్కులేదు.. సర్దుకుపొమ్మన వైనం



కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే ఉంటూ పెద్దాయనకు నమ్మినబంటుగా ఉన్న చేనేత నాయకుడిని తీవ్ర అవమానానికి గురి చేసినట్లు సమాచారం. 'నీవు మా ఇంటి దగ్గరకు రావద్దు.. నీ ప్రచారం మాకక్కర్లేదు' అంటూ అభ్యర్థి సోదరుడు తెగేసి తెప్పడంతో అవమానంతో ఆ నాయకుడు పెద్దాయన వద్దకు వెళ్లి బోరున విలపించినట్లు తెలిసింది. 'మా పరిస్థితే బాగలేదు.. మాగోడు ఎవరితో చెప్పుకోవాలి.. సర్దుకుపోవాలి' అని పెద్దాయనే చెప్పడంతో దిక్కుతోచని ఆ నాయకుడు బళ్లారికి వెళ్లిపోయి ఇటీవలే తిరిగి వచ్చినట్టు తెలిసింది. ఓ వైపు చేనేతలమని చెప్పుకుంటూ ఓట్లు అడుగుతూ అదే సామాజికవర్గానికి చెందిన నాయకులను తీవ్ర అవమానాలకు గురి చేయడం చర్చగా మారింది. దీనికితో తోడు ఆ అభ్యర్థిని ఓటమి భయం వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అధిష్టానం సూచన మేరకు పెద్దాయన తన కొడుకు, అల్లుడిని ప్రచారానికి పంపుతున్నారని సమాచారం. అప్పటికీ ఓటమి భయం పోకపోవడంతో అభ్యర్థి సోదరుడు డబ్బు మూటలతో రంగంలోకి దిగి కౌన్సిలర్లు, గ్రామాల్లో చోటామోటా నాయకులకు రూ.2-5 లక్షల వరకు డబ్బు కట్టలు పడేసినట్లు తెలిసింది. మరోవైపు టీడీపీలోని అసంతృప్త నాయకులను రూ.లక్షలకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అదే క్రమంలో ఓటుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

వైసీపీ ఎమ్మెల్యేలపై జనాగ్రహం

ఎమ్మెల్యేలు సాయి, బాలనాగిరెడ్డిల నిలదీత తలలు పట్టుకుంటున్న రాంపురం రెడ్డి సోదరులు



పెద్దకడుబూరు మండలం చిన్నకడుబూరులో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని నిలదీస్తున్న మహిళలు

కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు జనాగ్రహానికి గురికాక తప్పడం లేదు. ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంపై నిలదీతలు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగానే శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని పెద్దకడుబూరు మండలం చిన్నకడుబూరు గ్రామస్థులు నిలదీశారు. జనాగ్రహం ఊహించని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి నోట మాట రాలేదు. అలాగే ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి కూడా ప్రజల నుంచి నిరసనలు ఎదుర్కొన్నారు. ఆదోని మండలం సంతెకూడ్లూరు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళితే.. తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని, తాగునీరు ఇవ్వడం లేదని ప్రజలు ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఐదేళ్లు తమ సమస్యలు పట్టించుకోకుండా ఓట్లు కోసం వచ్చారా అని ప్రజలు నిలదీస్తుండడంతో రాంపురం రెడ్డి సోదరులు తలలు పట్టుకుంటున్నారు. పెద్దకడుబూరు మండలం చిన్నకడబూరు, రంగాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఏ గ్రామానికి వెళ్లినా తాగునీరు, ముగురునీటి కాలువలు, రోడ్లు ఎక్కడని మహిళలు గట్టిగా నిలదీస్తున్నారు. చిన్నకడబూరు గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన సర్పంచ్ అనసూయమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఘర్షణకు దిగారు. సర్పంచ్ వర్గీయులు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసీపీ జెండాకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీలకు పని చేప్పారు. ఓట్ల కోసం వచ్చి పోలీసులతో కొట్టిస్తారా..? రేప్పొద్దున పోలీసులతోనే ఓట్లు వేయించుకోండంటూ మహిళలు శాపనార్థాలు పెడుతూ ఇంటిదారి పట్టారు. ఆదివారం కూడా ఎమ్మెల్యేకు ప్రజల నుంచి తిరుగుబాటు తప్పలేదు. పెద్దకడుబూరు, జలవాడి, కంబలదిన్నె, చిన్నతుంబళం, బసలదొడ్డి గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా తాగునీటిపై ప్రజలు నిలదీశారు. ప్రజల నిలదీతలు పెరగడంతో గ్రామ నాయకులపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



లాఠీలతో గ్రామస్తులను చెదరగొడుతున్న పోలీసులు



పత్తికొండ అండ ఎవరికో..






- ఏడు సార్లు టీడీపీ అభ్యర్థుల గెలుపు
- ఈసారి కేఈ శ్యాంబాబు, కంగాటి శ్రీదేవిల నడుమ పోరు

పత్తికొండ, మే 5 : పత్తికొండలో ఈసారి గెలుపు ఎవరన్న చర్చ జోరుగా సాగుతోంది. టీడీపీ నుంచి కేఈ శ్యాంబాబు, వైసీపీ నుంచి కంగాటి శ్రీదేవి పోటీ చేస్తున్నారు. గెలుపు కోసం టీడీపీ, వైసీపీలు హోరాహోరీగా పోటీ పడుతున్నాయి. 1955లో ఏర్పాటైన పత్తికొండ అసెంబ్లీ నుంచి మొదటి ఎమ్మెల్యేగా గుండ్లకొండ హనుమంతరెడ్డి కాంగ్రెస్ తరపున గెలుపొందారు. 1957లో స్వతంత్ర అభ్యర్థి లక్ష్మీనారాయణరెడ్డి, 1967 సీపీఎం అభ్యర్థి ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులపై విజయం సాధించారు. 1962, 1972,1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కురుబ సామాజిక వర్గానికి చెందిన కేబీ నరసప్ప విజయం సాధించారు. రాయలసీమ పరిరక్షణ సమితి చైర్మన్‌గా, చక్కర శాఖ మంత్రిగా ఆయన పని చేశారు.

బిగ్ ఫైట్



టీడీపీకి కంచుకోటగా నిలిచిన పత్తికొండ

పార్టీ ఆవిర్భావం నుంచి పత్తికొండ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా నిలిచింది. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మారెడ్డి విజయం సాధించగా 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మహాబలేశ్వరగుప్తా గెలుపొందారు. ఆయన గెలుపును జీర్ణించుకోలేక ప్రత్యర్థులు గెలిచిన రెండు నెలల్లోనే హత్య చేశారు. 1986లో జరిగిన ఉప ఎన్నికలో గుప్తా సతీమణి సుబ్బరత్నమ్మ టీడీపీ అభ్యర్థిగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి పి. శేషిరెడ్డి విజయం సాధించగా, 1994 నుంచి 2004 వరకు టీడీపీ అభ్యర్థిగా ఎస్వీ సుబ్బారెడ్డి వరుస విజయాలను అందుకున్నారు. వ్యవసాయ, రోడ్లు రవాణ శాఖ మంత్రిగా పని చేశారు. 2009లో కేఈ ప్రభాకర్, 2014 కేఈ క్రిష్ణమూర్తి టీడీపీ తరపున విజయం సాధించారు. వెవెన్యూ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా కేఈ క్రిష్ణమూర్తి పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా కేఈ క్రిష్ణమూర్తి కుమారుడు కేఈ శ్యాంబాబు, ప్రస్తుత ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బరిలో ఉన్నారు. పత్తికొండ పీఠం నీదా నాదా అంటూ ఇద్దరు ప్రచారంలో దూకుడు పెంచారు. సీపీఐ అభ్యర్థిగా పి. రామచంద్రయ్య పోటీలో ఉన్నారు.



కేఈ బలాలు..

కేఈ శ్యాంబాబు తండ్రి కేఈ క్రిష్ణమూర్తి డిప్యూటీ సీఎం హోదాలో పత్తికొండ తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడం. బీసీ సామాజిక వర్గాలు అండగా ఉండడం.

బలహీనతలు..

పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులకు కొత్తగా వచ్చిన యువ నాయకులకు మధ్య కొన్ని గ్రామాల్లో సయోధ్య లేకపోవడం.

శ్రీదేవి బలాలు..

ఎమ్మెల్యేగా పని చేసిన ఐదేళ్లకాలంలో గ్రామాల్లో సొంతంగా వర్గాలను ఏర్పాటు చేసుకోవడం. అసమ్మతి నాయకును బుజ్జగించి కలుపుకుని ముందుకు సాగడం.

బలహీనతలు..

ఐదేళ్ల కాలంలో అక్రమార్జనలు, భూకబ్జాలు, ఇసుక దందాలు. బంధువులకు, సొంత సామాజిక వర్గాలకు చెందిన వారికే పట్టం కట్టడం.

గోడ దూకేద్దామా..?



ఎన్నికల వేళ పార్టీలు ఫిరాయించడం, రాత్రి రాత్రే కండువాలు మార్చేయడం సహజమే. అయితే ఇప్పుడు నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన పూర్తి కావడంతో పాటు అభ్యర్థులు ఖరారయ్యారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో అధికారి పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు గోడ దూకేయడానికి సిద్ధంగా ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వైసీపీలో వర్గవిభేదాలు ఎక్కువయ్యాయి. నెల క్రితం ఇద్దరు కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రెండు రోజుల క్రితం నగరంలోని 11వ వార్డు కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, సీనియర్ నాయకురాలు జమీలా బేగంలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ముందుగానే దుకాణం సర్దుకుంటే మెరుగ్గా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో మూడు రోజుల్లో ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

- కర్నూలు(న్యూసిటీ)

ఆ ఓటర్లకు మరో అవకాశం



కర్నూలు(కలెక్టరేట్), మే 5: ఎలక్షన్ కమిషన్ తాజాగా ఓ కీలక ప్రకటన చేసింది. పోస్టల్ ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. తమ ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును సంబంధిత ఫెసిలిటేషన్ సెంటర్‌కు తీసుకువెళ్లి ఓటు పొందవచ్చని తెలిపింది. ఇలాంటి వారి కోసం ఈ నెల 7,8 తేదీల్లో ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా కలెక్టర్ జి.సృజన ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటర్ల జాబితాలో పేరు ఉండి, అనివార్య కారణాల వల్ల పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పించామన్నారు. ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే.. ఆ నియోజకవర్గం ఆర్వోకు 6, 7, 8 తేదీల్లో ఫామ్-12 దరఖాస్తు, ఎన్నికల డ్యూటీ ఆర్డర్‌లను సమర్పించి అక్కడే ఉన్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. అన్ని ఫెసిలిటేషన్ సెంటర్లలో కనీస మౌలిక సదుపాయాలను, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశామని.. ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే రెండు విడతల శిక్షణ ఇచ్చామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించామని కలెక్టర్ వెల్లడించారు.

గోరంట్లలో టీడీపీ ప్రచారం



గోరంట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు, మే 5: మండలంలోని గోరంట్లలో టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కూటమి శ్రేణులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు, కున్నూరు మధు, ఎంసీ గిడ్డయ్య ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ, సద్దలవీధి, బీసీ కాలనీల్లో సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, సుదర్శన్, మధు ఎమ్మార్పీఎస్ అయ్యన్న, నగేష్, రాజు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఓర్వకల్లు, మే 5: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో టీడీపీ మేనిఫెస్టోలో అమలుపరిచిన అంశాలను వివరిస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, బత్తుల వెంకటరమణ, నారాయణరెడ్డి, పుష్పరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు బహిరంగ సభకు తరలిరండి

ఓర్వకల్లు, మే 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సోమవారం ఉదయం 10 గంటలకు కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో భాగంగా చంద్రబాబు ప్రజాగళం సభకు వస్తున్నారని, ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(న్యూసిటీ), మే 5: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజు అత్యవసర సేవలందించే 33 విభాగాలకు చెందిన వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సృజన, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవతేజ ఎక్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం నుంచి బుధవారం జరిగే పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో 2 వేల మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

గూడూరు, మే 5: తిమ్మగురుడు స్వామి జాతర సందర్భంగా గూడూరులో ఎంజీబీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆదివారం టీడీపీ నాయకులు చరణ్ కుమార్, రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెట్టుకింది సురేష్, చెట్టుకింది నారాయణ, మూలగేరి లక్ష్మన్న, అయ్యవారి నాయుడు, సంగాల మధు, వై.నాగరాజు పాల్గొన్నారు.

క్యాజువాల్టీలో రోగి మృతిపై వివాదం

వైద్యులతో బంధువుల వాగ్వాదం

కర్నూలు(హాస్పిటల్), మే 5: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాజువాల్టీలో ఓ భవన నిర్మాణ కార్మికుడి మృతి వివాదాస్పదంగా మారింది. నగరంలోని బండిమెట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ (60) భవన కార్మిక మేస్త్రీగా పని చేస్తున్నాడు. శనివారం వాంతులకు గురై అస్వస్థతతో నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం మళ్లీ అస్వస్థతతో కర్నూలు జీజీహెచ్ క్యాజువాల్టీలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ రోగి మృతి చెందాడు. వచ్చిన వెంటనే చికిత్స అందించి ఉంటే రోగి బతికేవాడని బంధువులు మెడిసిన్ వైద్యులతో వాగ్వాదానికి దిగారు. అయితే వైద్యులు మాత్రం రోగి వచ్చిన వెంటనే అడ్మిషన్ చేయించుకుని చికిత్స చేశామని, సీపీఆర్ కూడా చేశామని తెలిపారు. కాగా బంధువులు మాత్రం రోగి వచ్చిన 20 నిమిషాల వరకు అసలు పట్టించుకోలేదని, కేవలం జూనియర్ డాక్టర్లు మాత్రమే రోగిని చూశారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోడుమూరు రూరల్, మే 5: మండలంలోని ప్యాలకుర్తి వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ బాలనరసింహులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మే 5: పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని బీ క్యాంప్ గ్రౌండ్‌లోని స్విమ్మింగ్ ఫుల్, వాకర్స్, క్రీడాకారులతో కలిసి మాట్లాడుతూ 40 ఏళ్లుగా నిస్వార్థంగా తాను కర్నూలు ప్రజలకు సేవ చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తగా తనకున్న అనుభవంతో తప్పకుండా కంపెనీలు తీసుకొస్తానని తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్, బాస్కెట్ బాల్, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

టీజీ భరత్ ఎమ్మెల్యే అవ్వబోతున్నారు: మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్

ఈ ఎన్నికల్లో టీజీ భరత్ భారీ మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యే అవ్వబోతున్నారని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. ఆదివారం టీజీ భరత్ కార్యాలయంలో నగరంలోని బండిమెట్ట ప్రాంతానికి చెందిన యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అందుకే 4 శాతం రిజర్వేషన్లు తీసేస్తారని బీజేపీని అడ్డం పెట్టుకుని ఓట్లు కొల్లగొట్టాలని చూస్తోందని మండి పడ్డారు. టీజీ భరత్ సమక్షంలో బండిమెట్ట వాసులు ముజాహిద్, జుబేర్, ఇబ్రామ్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని గడ్డా ప్రాంతంలో మాజీ శాసన మండలి చైర్మన్ ఎంఏ షరీఫ్‌తో కలిసి టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఈ ఐదేళ్లలో 5 సార్లు విద్యుత్ బిల్లులు పెంచారని ఆయన మండి పడ్డారు. పెరిగిన ధరలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముస్లింలు కులం, మతం చూడకుండా తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** నగరంలోని ఐదో వార్డుకు చెందిన చిన్న కుమార్, యూసుఫ్, జాకీర్, పెద్ద కుమార్, విజయ్, మధు, నాగరాజు టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలంతా తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి, ఐదో వార్డు ఇన్‌చార్జి బాలు, సురేష్, రాజు పాల్గొన్నారు.

● **వైసీపీ పాలనలో ప్రజలపై భారం:** వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలపై ఖర్చుల భారం పెరిగిపోయిందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని అశోక్ నగర్ 44, 45, 46 వార్డుల్లో ఆత్మీయ సమావేశంలో శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 రోజులుగా కర్నూలులో ఉంటున్న తన ప్రత్యర్థి వైసీపీ నాయకు డికి ఇక్కడి ఇబ్బందులు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఏంఏ షరీఫ్ మాటాడుతూ ముస్లిం రిజర్వేషన్లపై వైసీపీ రాజకీయాలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ 44, 45, 46 వార్డుల ఇన్‌చార్జిలు, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



వాకర్స్‌తో ఉత్సాహంగా మాట్లాడుతున్న టీజీ భరత్

వైసీపీ భూ బకాసురులకు ఓటుతో బుద్ధి చెప్పండి

చెట్లమల్లాపురం, నాయకల్, కొంగనపాడు, ఉలిందకొండ ఎన్నికల ప్రచారంలో గౌరు చరిత, బైరెడ్డి శబరి

కల్లూరు, మే 5: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీ భూ బకాసురులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం, నాయకల్, కొంగనపాడు, ఉలిందకొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత, బైరెడ్డి శబరి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంస పాలనతో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన అధ్యక్షుడు చింతా సురేష్, మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, ఉలిందకొండ టీడీపీ నాయకులు ఈవీ.రమణ, రంగస్వామిరెడ్డి, తిమ్మారెడ్డి, సోమేశ్వరయ్య, వినోద్, గోరంట్ల నాగయ్య, నీలకంఠం పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** ఉలిందకొండ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు స్కూల్ చైర్మన్ కృష్ణ, తెలుగు రాముడు, గొల్లతిరుపాలు, ఉప్పరి సురేష్‌తోపాటు 20 కుటుంబాలు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీ కూటమి గెలుపు ఖాయం: గౌరు జనార్దన్‌రెడ్డి

రాష్ట్రంలో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 34వ వార్డు నిర్మల్‌నగర్, 41వ వార్డు నాగేంద్రనగర్, శిల్పా నందనవనంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పీయూ మాదన్న, కాసాని మహేష్‌గౌడ్, జవ్వాజి గంగాధర్‌గౌడ్, ధనుంజయ జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఉలిందకొండ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గౌరు చరిత, బైరెడ్డి శబరి

34, 41వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టిన గౌరు జనార్దన్ రెడ్డి



టీజీకి మద్దతుగా బ్రాహ్మణ సంఘ నేతల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), మే 5: కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ గెలుపును కాంక్షిస్తూ కర్నూలులోని వివిధ బ్రాహ్మణ సంఘాల నేతలు ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మెనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు ఎస్ వెంకటరామరాజు, సండేల్ చంద్రశేఖర్, మారుతి శర్మ, రవిచంద్ర శర్మ, దేవీ ప్రసాద్, శివప్రసాద్, ఆనందరావు పాల్గొన్నారు.

'వీహెచ్‌పీని బలోపేతం చేయాలి'



మాట్లాడుతున్న కాకర్ల రాముడు

కర్నూలు(కల్చరల్), మే 5: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 ఏళ్లు అవుతుందని, ఈ సం దర్భంగా వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు 60 వసంతాల ఉత్సవాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, రాష్ట్ర సహ సేవా కన్వీనర్ పీవీ గురుమూర్తి, మాళిగి భానుప్రకాశ్, గిరిబాబు, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కర్నూలు(అగ్రికల్చర్), మే 5: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు వస్తాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలో వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ డిప్లమా కోర్సు చేస్తున్న వారికి రిటైర్డు జేడీఏ జయచంద్ర ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి డీపీఎం చంద్రశేఖర్ వివరించారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షణ

కర్నూలు(కలెక్టరేట్), మే 5: జిల్లాలోని మొత్తం 8 నియోజకవర్గాల్లో ఉన్న 2204 పోలింగ్ స్టేషన్‌లను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన ఆదివారం పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఒక కెమెరా, పోలింగ్ కేంద్రం వెలుపలి దృశ్యాలను వీక్షించడానికి ఇంకొక కెమెరా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 2204 పోలింగ్ స్టేషన్‌లోల 4408 కెమెరాలను ఈ నెల 8వ తేదీలోగా ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నప్పుడు ఏదైనా సాంకేతిక సమస్యలు వస్తే వాటిని పరిష్కరించేందుకు టెక్నికల్ టీంలతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు ట్రయల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం నుంచి పోలింగ్ ముగిసి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేంత వరకు వెబ్‌కాస్టింగ్ కెమెరాలు ఆన్‌లోనే ఉంటాయన్నారు.

కాశీక్షేత్రం పుస్తకావిష్కరణ

కర్నూలు(కల్చరల్), మే 5: ప్రకాశ్‌నగర్ రైల్వేగేటు సమీపంలోని ఆవోపా సేవా సదన్ సమావేశ హాలులో సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వ ర్యంలో ప్రముఖ కవి 'శతక ప్రియ' ఎల్లాల యతిరాజం మీనా నాగేశ్వరరావు రచించిన కాశీక్షేత్రం' పుస్తక ఆవిష్కరణ సభ ఆదివారం రాత్రి జరిగింది. ఈ సభకు విశ్రాంత తహసీల్దారు కె. క్రిష్టన్న అధ్యక్షత వహించగా, విశ్రాంత స్పెషల్ కలెక్టర్ ఎస్ రామస్వామి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన జి. పుల్లయ్య మాట్లాడుతూ యాత్రికులకు ఎంతో ఉపయోగపడే విధంగా కాశీయాత్ర పుస్తకం నిలుస్తుందని రచయిత కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని గురించి ఆవోపా అధ్యక్షుడు మేడా వెంకట సురేష్, ఏపీ టూరిజం కార్పొరేషన్ కర్నూలు డివిజనల్ మేనేజర్ డీపీ చంద్రమౌళి రెడ్డి, యువ రచయిత డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, విశ్రాంత క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ మోక్షేశ్వరుడు విశ్లేషిం చారు. ఈ సందర్భంగా నగరంలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న పన్నెండు మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్, నిర్వాహక సమితి ప్రతినిధులు సజ్జనంగాండ్ల మహాబలేష్, పరు చూరి మురళీకృష్ణ, మహేంద్రకర్ నాగోజీరావు, చల్లా దామోదర్‌రెడ్డి, ఆవోపా చీఫ్ ఎం. నాగేశ్వరరావు, ఎస్వీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

కర్నూలు(కల్చరల్), మే 5: తైక్వాండో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని వీఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి. వాసురెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు పార్కులో ఏర్పాటు చేసిన తైక్వాండో క్రీడాకారుల వేసవి శిక్షణ శిబిరంలో ఆయన సొంత ఖర్చులతో క్రీడాకారులకు కిట్లు, బ్యాగులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా వాసురెడ్డి మా ట్లాడుతూ తైక్వాండో క్రీడకు స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, కోచ్‌లు రోహిత్, నాగరాజు, టి. తేజ, అజయ్, తిలక, లఖిల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

రౌడీ రాజకీయాలను సహించం: విష్ణు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి

కోడుమూరు/కోడుమూరు(రూరల్), మే 5: కోడుమూరు నియోజకవర్గంలో రౌడీ రాజకీ యాలు సహించబోమని టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లపరి గ్రామంలో విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఇంటిం టి ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీలో ఎమ్మెల్యే, ఇన్‌చార్జి గ్రూపులంట.. ఆ గ్రూపులు పగలు కుస్తీ.. రాత్రి దోస్తీ మా దిరి నడుస్తున్నాయని విమ ర్శించారు. ఎవరికి వారు అధికారాన్ని అడ్డుపె ట్టుకుని ఇసుక, మట్టి, భూకబ్జాలతో అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దోపిడీ, కబ్జాదారులపై విజిలెన్స్, సీఐడీ విచారణ జరిపించి జైలుకు పంపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. వైసీపీ నాయకులు కనీసం రైతులకు సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు.

వైసీపీని నమ్మితే అమ్మేస్తారు జాగ్రత్త: దస్తగిరి

జగన్‌కు ఒక్క చాన్స్ ఇచ్చినందకే రాష్ట్రంలో సహజ వనరులు దోచేశారని, మళ్లీ మోసపోతే మానవ వనరులను కూడా అమ్మేస్తారని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కల్లపరి ప్రచారంలో ఆయన మాట్లాడుతూ అప్పట్లో తుగ్లక్ జుట్టుపై పన్ను వేసినట్లు విన్నామని, జగన్‌ను నమ్మితే తాగేనీరు, గాలిపై పన్ను వేస్తాడని ఎద్దేవా చేశారు. స్థానిక శివాలయం, చర్చిలో విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** మండలంలోని చిల్లబండ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు విష్ణు సమక్షంలో టీడీపీలో చేరాయి. ఆదివారం కల్లపరి ప్రచా రంలో వారు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో సుధా కర్, అచ్చన్న, శ్రీరాములు, రాముడు, జగన్, రంగడు, మధు, సత్తార్, గిడ్డయ్య, మద్దిలేటి ఉన్నారు.

సి.బెళగల్: వైఎస్ జగన్ ఐదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడే చేస్తాడట అని టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మారందొడ్డి గ్రామంలో ప్రచారానికి ముందు చర్చిలో విష్ణు, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రార్థనలు చేశారు. అనంతరం బ్రాహ్మణదొడ్డి, ఎర్రగుంట కొట్టాల గ్రామాలలో బొగ్గుల దస్తగిరి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నాగరాజు, తిమ్మప్ప, హరి, ఎంపీటీసీ ఈరన్నగౌడు, జడ్పీటీసీ గిరిజోన్, జిక్రియ, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, అమర్ పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: విష్ణు

కర్నూలు(రూరల్), మే5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామంలో ఆదివారం సాయంత్రం వారు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ వైసీపీలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్థానికంగా సమర్థులైన దళిత నాయకులు కరువైయ్యారా అని జగన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసీపీలో స్థానికంగా ఎంతోమంది నాయకులు ఉన్నా, గతంలో ఎన్నడులేని విధంగా జగన్ వలస నాయకుడైన సతీష్‌ను దిగుమతి చేసు కోవాల్సిన అవసరం ఏముంటుందన్నారు. అలాంటి వ్యక్తికి ఓటువేస్తే ప్రతి చిన్నపనికి ప్రకాశం జిల్లాకు కోడుమూరు ప్రజలు వలసపోయే పరిస్థితి ఉంటుందన్నారు. టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానన్నారు. జనసేన నాయకుడు రాంబాబు, బీజేపీ నాయకుడు లక్ష్మణ్ నాయుడు, స్థానిక నాయకులు బుర్ర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శివన్న, మద్దిలేటి, రాఘవేంద్ర, చెన్నయ్య పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు
● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన విజయవంతం



రోడ్‌షోలో పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఆదోని (అగ్రికల్చర్), మే 5: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదోనిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం విజయవంతం అయ్యింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం నుంచి రోడ్డు మార్గాన ఎమ్మిగనూరు సర్కిల్ వరకు వచ్చారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి గుండా రోడ్‌షో చేపట్టారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో పాటు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, బీజేపీ నాయకులు విట్టా రమేష్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్ షో సాగింది. స్థానిక భీమాస్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో రోడ్డు, కూడలి అంతా జనసంద్రం అయ్యింది. ఉత్సాహంతో కేరింతలు కొడుతూ నినాదాలు చేశారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికి అవమానం...

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలికేందుకు వచ్చారు. అయితే ప్రోటోకాల్లో స్వాగతం పలికేందుకు ఆయన పేరు లేకపోవడంతో బీజేపీ అభ్యర్థి పార్థసారధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ పార్టీ జిల్లా అధ్యక్షుడికి అవమానం కలిగేలా ప్రవర్తించడం మంచిది కాదని సూచించారు. మీనాక్షినాయుడు కల్పించుకొని వెంటనే స్వాగతం తెలిపేందుకు అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీంతో అక్కడి నుండి ఎస్‌ఎస్‌జీ, డీఎస్పీ చర్చించి అనుమతించారు.

50 ఏళ్లకే రూ.4వేల పింఛన్

తుగ్గలి, మే 5: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అందిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. ఆదివారం రాతనలో టీడీపీ మండల ఇన్‌చార్జిలు మురళిధర్‌గౌడు, రుద్రగౌడు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి నాగరాజు సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి, టీడీపీ నాయకులు క్రిష్ణమూర్తి చౌదరి, మిద్దె వెంకటేశ్ యాదవ్, ఈరమ్మ, వెంకటస్వామి, మధుబాబు, చంద్రశేఖర్ యాదవ్, పాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆస్పరి, మే 5: జొహరాపురం గ్రామంలో ట్రాక్టర్-ద్విచక్ర వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మొలగవల్లి గ్రామానికి చెందిన కొట్టాల నారాయణ (45) ద్విచక్ర వాహనం పై గ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు జొహరాపురం గ్రామ సమీపంలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఒకదానికి ఒకటి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం పై వస్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, భార్య సుశీలమ్మ ఉన్నారు.

పెత్తందారుల మోచేతి నీళ్లు తాగే

బతుకులు వద్దు

- ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్, గుమ్మనూరు జయరాం
- హొళగుంద మండలంలో టీడీపీ విస్తృత ప్రచారం
- బహిరంగ సభకు భారీగా తరలిన జనం
- హళ్లి, పెద్దగోనెహల్, కోటకొండలో 300 వైసీపీ కుటుంబాల చేరిక





హొలగుందలో సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్, ప్రచార రథంపై గుంతకల్ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం, హాజరైన టీడీపీ శ్రేణులు

హొళగుంద, మే 5: పెత్తందారుల మోచేతి నీళ్ల తాగే బతుకులు మనకు వద్దని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని గుంతకల్ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం, టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం హొళగుందలో జరిగిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచార సభలో గుంతకల్ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. గుమ్మనూరు రాకతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైయ్యింది. గుమ్మనూరు జయరాం, వీరభద్రగౌడ్ అభిమానులు టీడీపీ నాయకులు బస్టాండులో భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు డీఎస్ బాషాను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరభద్రగౌడ్, జయరాం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం చంద్రన్న సూపర్ సిక్స్ పథకాలు తెచ్చారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, బాగోడి రాము, తోక వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కోటకొండ వాసులు

దేవనకొండ : పి.కోటకొండ గ్రామానికి చెందిన50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వైస్ ఎంపీపీ కుటుంబ సభ్యులతో పాటు మరో పది కుటుంబాలు ,మాల , ఎస్సీ కాలనీలలో దాదాపు 40 కుటుంబాలు ఆలూరుకి వెళ్లి వీరభద్రగౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు.



వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న కోటకొండ గ్రామస్థులు





హళ్లి, హెబ్బటంలో వీరభద్రగౌడ్‌కు, తిక్కారెడ్డికి తమ్ముళ్ల స్వాగతం

తిక్కారెడ్డితో కలిసి వీరభద్రగౌడ్ విస్తృత పర్యటన

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి మండలంలోని హెబ్బటం, పెద్ద గోనేహాళ్, చిన్నహ్యాట, లింగంపల్లి, బీజేహళ్లి గ్రామాల్లో వీరభద్రగౌడ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపే శక్తి చంద్రబాబుకు ఉందన్నారు. టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. అనంతరం ఎండీ హళ్లి గ్రామం నుంచి 50 , పెద్దగోనేహాళ్ గ్రామం నుంచి 150 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో ఎండీ హళ్లి సర్పంచు సుధాకర్, వీరనాగప్ప, ఈరన్న, హెబ్బెటం పక్కీరప్ప, వన్నూరప్ప పాల్గొన్నారు.

రూ.పది ఇచ్చి వంద దోచారు

- క్రిష్ణగిరి మండలంలో కేఈ శ్యాంబాబు విస్తృత ప్రచారం
- మద్దతు ప్రకటించిన ఆర్యవైశ్యులు
- పెరవలిలో ఇంటింటి ప్రచారం
- రత్నపల్లెలో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక









కోయిలకొండలో కేఈ శ్యాంబాబుకు గజ మాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు, అమకతాడులో మాట్లాడుతున్న కేఈ, వెల్దుర్తిలో టీడీపీలో చేరుతున్న నాయకులు, పెరవలిలో ప్రచార దృశ్యం

క్రిష్ణగిరి, మే 5: నవరత్నాల పేరుతో వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని లూటీ చేశారని, ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచారని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం కోయిలకొండ, ఎరుకలచెరువు, అమకతాడు, మాదాపురం, కర్లకుంట, పుట్లూరు గ్రామాల్లో కేఈ వేణుబాబు, కేఈ సందీప్‌లతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో సారి జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అంధకారం చేస్తాడని అన్నారు. ఎమ్మెల్యేగా శ్రీదేవి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నబి సాహెబ్, మర్రి శ్రీరాములు, ఎల్వీ ప్రసాద్, గురుస్వామి, మహ్మద్ రఫీ, లక్ష్మీశ్వరయ్య, ఆకుల గంగన్న, వీరబద్రుడు, రామక్రిష్ణ, పుల్లన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో ఇంటింటి ప్రచారం

మద్దికెర: మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలింటి రాము యాదవ్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పెరవలి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు నరసింహులుగౌడు, పారా రవి, మంగళ రంగస్వామి, మాజీ సర్పంచ్ వెంకటవర్మ, రాము, రంగస్వామి తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన రత్నపల్లె వాసులు

వెల్దుర్తి : రత్నపల్లెకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ పార్టీలో చేరారు. అమకతాడులో కేఈ.శ్యాంబాబు స్వగృహంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడు, రమాకాంత్‌రెడ్డి, అన్నసూరీడు ఆధ్వర్యంలో వీరిని కేఈ.శ్యాంబాబు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఆర్యవైశ్యులకు టీడీపీతోనే గుర్తింపు

మద్దికెర : ఆర్యవైశ్యులకు తెలుగుదేశం పార్టీలోనే మంచి గుర్తింపు ఉంటుందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది సురేష్ కుమార్, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మద్దికెర ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు తెలుగుదేశం పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎక్కువ శాతం వ్యాపారాల్లో కొనసాగుతున్నామని, వైసీపీ విధానాల వల్ల చాలా మంది నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయానికి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి దివాకర్ గౌడు, సుంకు రవీంద్ర, ముత్యాల రాజశేఖర్, తిమ్మయ్యశెట్టి, మెడికల్ వీరేష్, రత్నయ్యశెట్టి, మధుసూదన్ గుప్తా, శ్రీనివాసులు శెట్టి, సతీష్, సంజీవనాథ్ శెట్టి, పవన్, సంపత్ కుమార్, గోపాల్ శెట్టి తదితరులు ఉన్నారు.



టీడీపీకి మద్దతు ప్రకటిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గ్రామాల్లో చిచ్చు పెట్టే సంస్కృతి వైసీపీది

- వైసీపీని వారం రోజుల్లో ఇంటికి పంపుదాం : రాఘవేంద్ర రెడ్డి
- గొల్లదొడ్డి, పల్లెపాడులో వైసీపీ కుటుంబాలు చేరిక
- కోసిగిలో మహిళా నాయకుల ఇంటింటి ప్రచారం
- వందగల్లులో వైసీపీ ఖాళీ









రాఘవేంద్రరెడ్డి సమక్షంలో, రామక్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వందగల్లు, పల్లెపాడు గ్రామస్థులు, కామవరం ప్రచారంలో ఉత్సాహంగా టీడీపీ శ్రేణులు, కోసిగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ మహిళా నాయకులు

కౌతాళం, మే 5: పచ్చని గ్రామాల్లో అన్నదమ్ముల్లా వ్యవహరించే గ్రామీణుల మధ్య రాజకీయాల లబ్ధికోసం చిచ్చు పెట్టి హత్య రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైసీపీ నాయకులదని టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కామవరం, ఉరుకుంద, తిమ్మాపురం, ఓబుళాపురం, చూడి, హల్వి, వల్లూరు, పొదలకుంట, మదిర, సుళేకేరి, బంటకుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేనా , టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను పట్టుకోని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ఏమి కాపాడుతాడని విమర్శించారు. నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భూకబ్జాలు, ఇసుక దోపిడీలు, అక్రమ మద్యం వ్యాపారం తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టలేదని విమర్శించారు. ప్రజలంతా తనకు తోడుగా నిలవాలని, పది రోజుల్లో వైసీపీ నేతలను ఇంటికి పంపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నబసప్ప, అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, క్రోట్రేష్‌గౌడ్ సురేష్‌నాయుడు, కోట్రేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, చిన్న తిక్కయ్య, రంగస్వామి జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకుడు రామకృష్ణ, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

గొల్లదొడ్డి, పల్లెపాడులో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

మంత్రాలయం : పెద్దకడుబూరు మండలంలోని గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు, కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆదివారం మండలంలోని మాధవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నివాసంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వందగల్లులో వైసీపీ ఖాళీ

కోసిగి : వందగల్లు గ్రామానికి చెందిన 35 దళిత కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిలో ముకుంద హనుమంతు, మద్రాసు చిన్న, తలారీ వీరేష్, ములిగేని చిన్న అంజినప్ప, కల్లూరి తిక్కస్వామితో పాటు మరికొంత మంది టీడీపీలో చేరారు. రెండు రోజుల్లోనే 50 కుటుంబాలకు పైగా వైసీపీని వీడడం ఆ పార్టీకి షాకేనని భావిస్తున్నారు.

టీడీపీలో చేరిన పల్లెపాడు గ్రామస్థులు

మండల పరిధిలోని ఫ్యాన్ పార్టీని వీడి పల్లెపాడు గ్రామానికి చెందిన వైసీపీ 25 కుటుంబాలు టీడీపీ సీనియర్ నాయకులు, సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, పల్లెపాడు సర్పంచ్ రాజేంద్రనాయుడు ఆధ్వర్యంలో రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామక్రిష్ణారెడ్డి, టీడీపీ పరిశీలకులు దేవళ్ల మురళి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

టీడీపీలోనే మహిళలకు పెద్దపీట

టీడీపీ పార్టీలోనే మహిళలకు పెద్ద పీట సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి మరదళ్లు, టీడీపీ మహిళా నాయకుడు బంగారమ్మ, చంద్రిక, కుమార్తె రమ్య అన్నారు. కోసిగిలోని 5, 6, 7, 8, 9 వార్డులలో ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. టీడీపీ సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామక్రిష్ణ, నరసారెడ్డి, అయ్యన్న, వక్రాణి వెంకటేశ్ పాల్గొన్నారు.


ఉమ్మడి మేనిఫెస్టోతోనే సకలజనులకు మేలు : బీవీ

- బీవీ గెలుపుకు కూటమి కృషి : రేఖాగౌడ్
- చేనేతల ఆత్మీయ సమావేశం, వీవర్స్ కాలనీలో ప్రచారం
- టీడీపీలోకి వెయ్యిమందికి పైగా చేరిక

ఎమ్మిగనూరు, మే5: ఎన్డీఏ కూటమి ఉమ్మడి మెనిఫెస్టోతోనే సకలజనులకు మేలు జరుగుతందని మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వీవర్స్ కాలనీలో జనసేన ఇన్‌చార్జీ రేఖాగౌడ్, బీజేపీ నాయకులు నరసింహులుతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎన్నికల మెనిఫెస్టో తుస్సుమందన్నారు. జనానికి ఉపయోగపడేవిధంగా లేదన్నారు. టీడీపీ మెనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఎన్నికల్లో టీడీపీని భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం జనసేన ఇన్‌చార్జీ రేఖాగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని, జయనాగేశ్వరరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు వార్డు ఇన్‌చార్జీ బిజ్జె నాగరాజు, నాయకులు కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, ముల్లా కలీముల్లా, కటారి రాజేంద్రలు పాల్గొన్నారు.

ఓట్లకోసం మాచేనేతలు అంటున్నారు

పట్టణంలోని లక్ష్మీపేటలో మాచాని శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేతల ఆత్మీయ సమావేశంలో బీవీ మాట్లాడుతూ వైసీపీ నేతలు ఓట్ల కోసం మా చేనేతలు అంటున్నారని, పథకాలు మాత్రం ఇవ్వరని ఇది ఇక్కడ వైసీపీ అభ్యర్థి పరిస్థితి అని బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎమ్మిగనూరులో చేనేతలు వేల సంఖ్యలో ఉండగా నేతన్న నేస్తం పథకం మాత్రం కేవలం 1300 మందికి మాత్రమే ఇచ్చారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ నేతన్న నేస్తం ఇస్తామన్నారు. కార్యక్రమంలో చేనేతకార్మికులు పాల్గొన్నారు.





మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ, టీడీపీలో చేరేందుకు ర్యాలీగా వస్తున్న 13,14వ వార్డు ముస్లిం యువత

టీడీపీలోకి భారీగా చేరికలు

ఆదివారం పట్టణం, నందవరం, గోనేగండ్ల మండలాల్లోని బాపురం, పెద్దనేలటూరు, నెరుడుప్పల, గంజహళ్లి, వెముగోడు గ్రామాలనుంచి వైసీపీకి చెందిన వెయ్యిమందికి పైగా టీడీపీలో చేరారు. ఎమ్మిగనూరు పట్టణంలోని 13,14వ వార్డుకు చెందిన ముస్లిం యువకులు మన నవాజ్ ఆధ్వర్యంలో 300మంది , 19వ వార్డులో ఉప్పర బసరకోడు వెంకటేష్, యూకే బీమన్నలతో పాటు పలువురు, ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్, పెసలదిన్నే, మల్కాపురం గ్రామాలనుంచి దాదాపు వెయ్యి కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీవీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.

ఏనుగుబాలలో విస్తృప్రచారం : ఏనుగబాల గ్రామంలో కూటమి అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగ్గాపురం ఈరన్న, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీపేటలో చేనేతల సమావేశంలో మాట్లాడుతున్న జయనాగేశ్వరెడ్డి